

**చీనీ టన్ను రూ.24 వేలు**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.24 వేలు పలికాయి.



**టమాట కిలో రూ.8**

అనంతపురం కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్ట ధర రూ.8 పలికింది. కనిష్టం 5, సరాసరి రూ.7 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.




## న్యూస్‌రీల్

### 5,847 కేసుల పరిష్కారం



కక్షిదారులకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, ఎస్పీ పి. జగదీష్

**అనంతపురం:** ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన 'జాతీయ మెగా లోక్ అదాలత్'లో 5,847 కేసులకు న్యాయమూర్తులు పరిష్కారం చూపారు. అనంతపురం, శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా మొత్తం 24 బెంచ్‌లు నిర్వహించారు. బాధితులు రాజీకి సమ్మతించడంతో 886 క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు 80, మోటారు వాహన ప్రమాద పరిహార కేసులు 48, ప్రీ లిటిగేషన్ కేసులు 388 పరిష్కారమయ్యాయి. ప్రమాద కేసుల్లో బాధితులకు రూ. 3.83 కోట్లు పరిహారంగా అందించారు. సివిల్ కేసుల్లో రూ.2.82 కోట్లు, ప్రీ లిటిగేషన్ కేసుల్లో రూ.68 లక్షలు రాజీ ప్రకారం బాధితులకు ఇప్పించారు. లోక్‌అదాలత్‌ను జిల్లా న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షుడు, ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి. శివప్రసాద్ యాదవ్ పర్యవేక్షించారు. జిల్లా కోర్టులో కక్షిదారులకు న్యాయమూర్తి జి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

### ఇంటర్ పరీక్షకు 319 మంది గైర్హాజరు



**పుట్టపర్తి టౌన్:** ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం విద్యార్థులకు శనివారం సెట్–3 ప్రశ్నపత్రంతో పరీక్షలు నిర్వహించారు. జనరల్ విద్యార్థులు 8,198 మందికి గాను 7979 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,641 మందికి గాను 1,541 మంది హాజరయ్యారు. మొత్తం 319 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి రఘునాథరెడ్డి తెలిపారు. ధర్మవరంలో పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా వ్యాప్తంగా పరీక్షలను స్పెషల్ ఆఫీసర్ చెన్నకేశవప్రసాద్, కమిటీ సభ్యులు సురేష్‌బాబు, రామరాజు, శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వరప్రసాద్ పర్యవేక్షించారన్నారు.

### కిరికెర సర్పంచ్‌కు ఉత్తమ పురస్కారం



కేంద్ర గ్రామీణ కమిషనర్ నుంచి పురస్కారాన్ని అందుకున్న సర్పంచ్ వైఎన్ భాగ్యమ్మ


**హిందూపురం:** పంచాయతీ స్వశక్తి అధినేత్రి ఉత్తమ పురస్కారాన్ని హిందూపురం మండలం కిరికెర పంచాయతీ సర్పంచ్ వైఎన్ భాగ్యమ్మ అందుకున్నారు. ఢిల్లీలో 5, 6 తేదీల్లో ముందస్తుగా జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళా ప్రజాప్రతినిధులను ఎంపిక చేశారు. అందులో ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి కిరికెర సర్పంచ్ భాగ్యమ్మ ఉన్నారు. కార్యక్రమంలో ఆమె మహిళా సాధికారత, ఫ్రెండ్లీ ఉమెన్, గ్రామ పంచాయతీల అభివృద్ధి గురించి క్లుప్తంగా ప్రసంగించిన తీరు అందరినీ ఆకట్టుకుంది. దీంతో సర్పంచ్ భాగ్యమ్మకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి కమిషనర్ వినోద్ కుమార్ చేతుల మీదుగా 'పంచాయతీ స్వశక్తి అధినేత్రి పురస్కారం'తో జాతీయ ఉత్తమ ప్రశంసా పత్రం షీల్డ్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా భాగ్యమ్మకు ఉమ్మడి జిల్లా మహిళా సర్పంచులు, స్థానిక పంచాయతీ ప్రజలు శుభాకాంక్షలు తెలియజేశారు.

### అలరించిన సంగీత కచేరీ



**ప్రశాంతి నిలయం:** సత్యసాయిని కీర్తిస్తూ నిర్వహించిన సంగీత కచేరీ భక్తులను అలరించింది. శనివారం సాయంత్రం ప్రశాంతినిలయం సాయి కుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహాసమాధి చెంత సత్యసాయి విద్యాసంస్థల ఫర్మార్మింగ్ ఆర్ట్స్ విభాగం విద్యార్థులు సంగీత కచేరీ నిర్వహించారు. గంటపాటు నిర్వహించిన సంగీత కచేరీతో సభా మందిరం మార్మోగింది.

# హామీ ఇచ్చారు.. టోపీ పెట్టారు!



- ఉమ్మడి అనంత జిల్లాకు ఎమ్మెల్సీ పదవి లేనట్టే
- కనీసం రేసులో కూడా లేని నాయకులు
- 14 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చినా దిక్కు లేని పరిస్థితి
- ఎన్నికల ముందు మాట ఇచ్చి నేడు పట్టించుకోలేదని నేతల నిట్టూర్పు

**సాక్షి ప్రతినిధి, అనంతపురం:** ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ నాయకుల పరిస్థితి దారుణంగా ఉంది. నాలుగు ఎమ్మెల్సీ సీట్లు ఖాళీ అవుతున్న నేపథ్యంలో ఒక్కటి కూడా ఉమ్మడి జిల్లా నేతలకు ఇచ్చే పరిస్థితి కనిపించడం లేదు. అధిష్టానం వద్ద ఇక్కడి నాయకుల పేర్లు కనీసం ప్రస్తావనకు కూడా రాలేదని తెలిసింది. దీంతో 'తెలుగుతమ్ముళ్ల'లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పార్టీకి కష్టపడి పనిచేసినా ఫలితం లేదని, మొత్తం సీట్లన్నీ గెలిచినా ఎమ్మెల్సీ భాగ్యం మాత్రం జిల్లాకు దక్కే పరిస్థితి లేకపోవడం దారుణమని వాపోతున్నారు.

**ఆశావహుల్లో నిరాశ..**

కూటమి సర్కారు కొలువుదీరి తొమ్మిది నెలలు పూర్తి కావస్తోంది. 2024లో జరిగిన ఎన్నికల్లో పాతవారిని కాదని కొత్తవారికి టికెట్లు ఇచ్చారు. ఆ సందర్భంగా పాతవారికి ఎమ్మెల్సీ పదవులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పుడేమో ప్లేటు ఫిరాయించినట్టు నేతలు చెబుతున్నారు. అప్పట్లో అనంతపురం అర్బన్ సీటు ప్రభాకర్ చౌదరి వదులుకోవాల్సి వచ్చింది. గుంతకల్లు సీటును జితేందర్‌గౌడ్ వదులుకున్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిరలో మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు డాక్టర్ సునీల్‌కుమార్‌కు అసెంబ్లీ టికెట్ ప్రకటించి, ఆ తర్వాత రద్దు చేశారు. కార్పొరేషన్ చైర్మన్ లేదా ఎమ్మెల్సీ పదవి ఇస్తామని హామీ ఇచ్చారు. అలాగే జిల్లాలో నిమ్మల కిష్టప్ప, పల్లె రఘునాథరెడ్డి, గుండుమల తిప్పేస్వామి ఇలా ఎందరో ఆశావహులు ఉన్నారు. కానీ వీళ్ల పేరు ఎక్కడా కనీసం ప్రస్తావనకు కూడా రాకపోవడంతో తీవ్ర నిరాశలో కూరుకుపోయినట్లు తెలిసింది.

**సామాజిక సమీకరణలు కుదరలేదట..!**

ఉమ్మడి జిల్లాకు ఎమ్మెల్సీ సీటు కేటాయించకపోవడానికి సామాజిక సమీకరణాలు కుదరడం లేదని చెబుతున్నారు. కమ్మ సామాజిక వర్గానికి చెందిన ప్రభాకర్ చౌదరికి ఇవ్వాలంటే.. మైలవరం నుంచి దేవినేని ఉమామహేశ్వరరావు పోటీలో ఉన్నారు. ఇక రెడ్డి సామాజిక వర్గానికి ఇచ్చే అవకాశం లేదు. బీసీ, ఎస్సీలకు ఇచ్చేందుకు కూడా ఇతర జిల్లాలనుంచి తీవ్ర పోటీ ఉందని, అందుకే ఈ దఫా ఉమ్మడి జిల్లాకు ఇవ్వలేమని చెబుతున్నారని కొంతమంది టీడీపీ నేతలు వాపోతున్నారు.

**లోకేష్ ఒప్పుకుంటేనే పదవి..**

మంత్రి లోకేష్ కనుసన్నల్లో ఉన్నవారికే ఎమ్మెల్సీ పదవి దక్కుతుందని పార్టీలో ఎవరినడిగినా చెబుతున్నారు. ప్రభాకర్‌చౌదరికి లోకేష్ వద్ద పెద్దగా పలుకుబడి లేదు. మిగతా నాయకులకూ అంతంత మాత్రమే. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌కు లోకేష్ వద్ద అంతో ఇంతో పలుకుబడి ఉన్నా.. ఆయన ఎవరినీ సిఫార్సు చేసే పరిస్థితి లేదని తెలుస్తోంది. ఉమ్మడి అనంత జిల్లాలో 14 ఎమ్మెల్యే సీట్లు గెలిపించినా ఒక్క ఎమ్మెల్సీ కూడా ఇవ్వలేకపోవడం దారుణమని కేడర్‌లో అసంతృప్తి ఉంది.

## నేడు ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



బ్రహ్మోత్సవాల స్వాగత తోరణం

**కదిరి:** ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఆదివారం అంకురార్పణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల్లో అంకురార్పణ ఘట్టానికి విశేష ప్రాధాన్యముంది. నవ ధాన్యాలు మొలకెత్తడాన్ని అంకురార్పణ అంటారు. బ్రహ్మోత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామివారి ఆశీస్సులు పొందటమే ఈ అంకురార్పణ ఘట్ట ముఖ్య ఉద్దేశం. సూర్యుడు అస్తమించిన తర్వాతే అంటే రాత్రి సమయంలో ఈ అంకురార్పణ ఘట్టం నిర్వహిస్తారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో నిర్వహించే అంకురార్పణ ఘట్టంలో అగ్నిహోమం ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే సకల దేవతలను ఆహ్వానిస్తారు.

**నవధాన్యాల మొలక..**

సకల దేవతల ఆహ్వానం అనంతరం భూమాతను ప్రార్థిస్తూ పాలిక (కొత్తకుండ)లను మట్టితో నింపుతారు. చంద్రుణ్ని ప్రార్థిస్తూ అర్చక బృందం వాటిలో నీరు పోసి నవ ధాన్యాలు చల్లుతారు. ఈ పాలికలకు నూతన వస్త్రాన్ని అలంకరించి పుణ్యాహవచనం గావిస్తారు. అనంతరం అర్చక పండితులు సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణు సూక్తం పఠిస్తారు. బ్రహ్మోత్సవాల్లో అర్చక పండితులు ప్రతి రోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోసి నారు పెరిగేందుకు సహకరిస్తారు. ఈ మొత్తం తంతు వేద మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసే భక్తుల కోసం పట్టణ నలుమూలల ఆలయ అధికారులు స్వాగత తోరణాలు ఏర్పాటు చేశారు.

## జిల్లా హాకీ జట్టు ప్రతిభ



జిల్లా హాకీ జట్టును అభినందిస్తున్న సూర్యప్రకాష్, జిల్లా హాకీ కోచ్ హుసేన్

**ధర్మవరం అర్బన్:** ఆంధ్రప్రదేశ్ హాకీ ఆధ్వర్యంలో గుంటూరు నాగార్జున యూనివర్శిటీలో జరిగిన 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీల్లో శ్రీసత్యసాయి జిల్లా జట్టు రజత పతకం సాధించిందని హాకీ ఆంధ్రప్రదేశ్ వైస్ ప్రెసిడెంట్ బి.సూర్యప్రకాష్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌరిప్రసాద్, జిల్లా హాకీ కోచ్ హుసేన్ తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను వారు శనివారం అభినందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈనెల 6 నుంచి 8 వరకు జరిగిన 15వ రాష్ట్రస్థాయి సీనియర్ పురుషుల హాకీ పోటీలలో క్వార్టర్ ఫైనల్‌లో విజయనగరం జిల్లా జట్టుపై 3 గోల్స్, సెమీ ఫైనల్‌లో గుంటూరు జిల్లా జట్టుపై 3–1 గోల్స్ తేడాతో గెలుపొందిందన్నారు. ఫైనల్‌లో తిరుపతి జిల్లా జట్టుపై 6–2 గోల్స్‌తో ఓటమి చెందిందన్నారు.

# జగన్ హయాంలోనే మహిళా సాధికారత



మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఉషశ్రీ చరణ్, టీఎన్ దీపిక

- ఆడబిడ్డల మిస్సింగ్‌పై నోరు మెదపని పవన్
- కూటమి పాలనలో మహిళలకు భద్రత కరువు
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ ధ్వజం

**చిలమత్తూరు:** వైఎస్ జగన్ హయాంలో మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ అన్నారు. హిందూపురంలోని వైఎస్సార్సీపీ కార్యాలయంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఉషశ్రీచరణ్, నియోజకవర్గ సమన్వయకర్త హాజరై మహిళలతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ డ్వాక్రా రుణాలు మాఫీ చేసి లక్షలాది మంది మహిళలకు మేలు చేకూర్చిన ఏకైక సీఎం వైఎస్ జగన్ అని కొనియాడారు. ప్రతి కుటుంబంలోనూ మహిళకు ప్రాధాన్యత లభించేలా ఆనాడు చేసి చూపించారన్నారు. మహిళలకు అనేక సంక్షేమ పథకాలతో పాటు రాజకీయ రంగంలోనూ మంత్రి పదవులు, 50శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. 30 వేల మంది ఆడబిడ్డలు రాష్ట్రంలో కనిపించకుండా పోయారని ఎన్నికల సమయంలో ప్రచారం చేసిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు వారి గురించి ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, మంత్రి లోకేష్ మహిళలను ఓటుబ్యాంకుగా మాత్రమే చూశారని వదిలేశారని మండిపడ్డారు. మహిళలకు మళ్లీ పాత రోజులు రావాలంటే, సంక్షేమం జరగాలంటే ఈ ముంచే కూటమి ప్రభుత్వం పోవాలని, ఆ దిశగా మహిళాశక్తి పోరాడాలని పిలుపునిచ్చారు.

**హామీలు నెరవేర్చరా..?**

ఎన్నికల సమయంలో మహిళలకు ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా అంటూ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక సీఎం చంద్రబాబును సూటిగా ప్రశ్నించారు. ఉచిత బస్సు ప్రయాణ పరిధి జిల్లా వరకు మాత్రమే అంటూ కొర్రీ వేయడం.. అది కూడా ఎప్పటి నుంచి అమలు చేస్తారో చెప్పకపోవడం మహిళలను నమ్మించి మోసం చేయడమేనన్నారు. మహిళల సంక్షేమం, భద్రత ఒక్క జగన్ హయాంలోనే ఉందని, నేడు మహిళలకు రక్షణ కరువైందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు లక్ష్మి, రాధమ్మ, సర్పంచ్‌లు లలితమ్మ, వైఎన్ భాగ్యమ్మ, కో ఆప్షన్ సభ్యురాలు కాంతమ్మ, సాహెరాబాను, కవితారెడ్డి, హరితారెడ్డి, సిద్దగంగమ్మ, హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

# మహిళాభ్యున్నతే లక్ష్యం

- బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించాలి
- చట్టాలపై మహిళలకు అవగాహన ఉండాలి
- మహిళా దినోత్సవంలో కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న



మహిళను సత్కరిస్తున్న ఎస్పీ రత్న, చిత్రంలో కలెక్టర్ చేతన్ తదితరులు

**పుట్టపర్తి అర్బన్:** మహిళాభ్యున్నతే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని కలెక్టర్ చేతన్ సూచించారు. శనివారం బ్రాహ్మణపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఎస్పీ రత్న, ఐసీడీఎస్ పీడీ వరలక్ష్మి, డీపీఓ సమత, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, మెప్మా అధ్యక్షురాలు పద్మావతి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రాజేశ్వరి ఆధ్వర్యంలో జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా పలు శాఖలకు చెందిన మహిళా సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు. ముఖ్య అతిథి కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడ జరిగినా కఠిన చర్యలు తీసుకొని పూర్తిగా నిర్మూలించాలన్నారు. ఈ విషయంలో ప్రతి మహిళా ప్రభుత్వానికి తోడ్పాటునందించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కులు, సామాజిక ఆర్థిక సహకారంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నాయన్నారు. ప్రతి మగాడి విజయం వెనుక తల్లి, చెల్లి, అక్క, కూతురూ ఇలా ఎవరో ఒకరు ఉంటారన్నారు. ప్రతి విజయం వెనుక మాతృమూర్తి దీవెన ఉందని, అందుకే లోకంలో తల్లిని మించిన దైవం లేదన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ జిల్లాలో మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రతి మహిళా చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు, పోక్సో శక్తి యాప్ తదితర అంశాల గురించి క్షుణ్ణంగా వివరించారు. అనంతరం పలువురి మహిళలను మెమొంటోలు, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన చిన్నారుల నృత్య ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. అనంతరం డీఆర్‌డీఏ ద్వారా మహిళా సంఘాల సభ్యులకు బ్యాంకు లింకేజీ కింద 4,380 మందికి రూ.74 కోట్లు, స్త్రీనిధి ద్వారా 2,979 మందికి రూ.29.79 కోట్లు, మెప్మా ద్వారా 4,205 మందికి రూ.21.34 కోట్లు, ఎంఎస్‌ఎంఈ ద్వారా ఐదుగురికి రూ.60 లక్షలు, పరిశ్రమల ద్వారా ముద్ర స్టాండప్ పథకాల ద్వారా 59 మందికి రూ.4 కోట్లు, పీఎం విశ్వకర్మ పథకం ద్వారా 160 మందికి రూ.1.15 కోట్ల చొప్పున చెక్కులను అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికిరణ్, మెప్మా ప్రతినిధులు, డీఆర్‌డీఏ సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఆధిపత్యం.. ఉపాధి ఖతం

కూలీలు పొట్టచేతపట్టుకుని ఇతర ప్రాంతాలకు వలస పోకుండా ఉన్న ఊరిలోనే పనులు కల్పించాలని ఉపాధి హామీ పథకం ప్రవేశపెట్టారు. ఏడాదిలో వంద రోజులు పనులు కల్పించాల్సి ఉంది. కూలీల నుంచి పని దినాల సంఖ్య పెంచాలని అంతటా డిమాండ్లు వస్తున్నాయి. ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరం ముగియడానికి ఇక 23 రోజులు మాత్రమే మిగిలి ఉంది. కానీ పని దినాల సంఖ్య లక్ష్యంలో 50 శాతానికి మించలేదు. ఇది ఎక్కడో కాదు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరం నియోజకవర్గంలోనే.

- కూటమి పాలనలో పనులు కరువు
- నిలిచిన ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాలు
- 'ఉపాధి' చరిత్రలో చీకటి రోజులు
- ఇదీ వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఇలాకాలో దుస్థితి



| ముదిగుబ్బ మండలంలో ఉపాధి హామీ వివరాలు | |
|---|---|
| గ్రామపంచాయతీలు | 25 |
| జాబ్ కార్డులు | 14,504 |
| కూలీలు సంఖ్య | 21,930 |
| ఏడాది పని దినాల లక్ష్యం | 5 లక్షలు |
| ఇప్పటి వరకు కల్పించిన పని దినాలు | 2,72,406 |

**ముదిగుబ్బ:** ఉపాధి హామీ పథకానికి రాజకీయ గ్రహణం పట్టుకుంది. తొమ్మిది నెలలుగా పనులు కల్పించకపోవడంతో కూలీలకు కడుపు కోత మిగిలింది. ధర్మవరం నియోజకవర్గంలోని ముదిగుబ్బ మండలంలో కూటమిలోని టీడీపీ–బీజేపీ–జనసేన నేతల మధ్య ఆధిపత్య పోరు తారస్థాయికి చేరింది. పదవులు, పోస్టులు.. ఆదాయ వనరులను హస్తగతం చేసుకునేందుకు తీవ్రస్థాయిలో పోటీపడుతున్నారు. ఈ క్రమంలో రాజకీయ నాయకులు తమ స్వలాభాలు చూసుకుంటున్నారు తప్ప ప్రజల గురించి పట్టించుకోవడం లేదు. ఉపాధి హామీ పథకంలో కూలీలకు పనులు కల్పించడంలో ఫీల్డ్ అసిస్టెంట్ల పాత్ర కీలకం. కూటమి కొలువు దీరిన తర్వాత ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్లను తొలగించారు. మండలంలో 25 గ్రామపంచాయతీలు ఉన్నాయి. పంచాయతీకి ఒకటి, మేజర్ పంచాయతీల్లో ఇద్దరు లేదా ముగ్గురు చొప్పున ఫీల్డ్ అసిస్టెంట్లు అవసరం ఉంటుంది. ఆయా పోస్టుల్లో తమకు అనుకూలంగా ఉన్నవారిని నియమించుకునే విషయంలో టీడీపీ– బీజేపీ నాయకుల మధ్య సయోధ్య కుదరలేదు. దీంతో ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకాల ప్రక్రియ నిలిచిపోయింది. ఫలితంగా ఉపాధి పనులపై ఆధార పడి జీవనం సాగిస్తున్న పేద కుటుంబాలకు ఆర్థిక ఇబ్బందులు తప్పడం లేదు.

**అదనపు పని దినాలు లేనట్లే!**

గత ఏడాదిలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జిల్లాలోని ముదిగుబ్బ, తాడిమర్రి, తలుపుల, కనగానపల్లి, ధర్మవరం, ఎన్పీ కుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, పరిగి, రాప్తాడును కరువు మండలాలుగా ప్రకటించారు. దీంతో ఆయా మండలాల్లో 50 అదనపు పని దినాలు మంజూరు చేశారు. ముదిగుబ్బ మండలం మినహా అన్ని మండలాల్లో ఆ మేరకు పనులు జరుగుతున్నాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్, మే నెలల్లో మాత్రమే ఉపాధి పనులు కల్పించారు. ఏడాదిలో 5 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యం ఉండగా.. జూన్‌లో కూటమి ప్రభుత్వం కొలువు తీరే నాటికి 2,72,406 పని దినాలు కల్పించారు.

- ఒక ఏడాదిలో కల్పించిన పనిదినాల ఆధారంగా ఆయా మండలాల అభివృద్ధికి 40 శాతం మేర మెటీరియల్ కాంపోనెంట్ నిధులు కేటాయిస్తారు. అయితే ఇంతవరకు ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం పూర్తికానందున 2.28 లక్షల పనిదినాలను కూలీలు కోల్పోయారు. దీంతో అభివృద్ధి పనులకు నిధుల కొరత ఏర్పడే ప్రమాదం ఉంది.
- ఈ విషయంపై ఎంపీడీఓ దివాకర్‌ను వివరణ కోరగా ప్రజాప్రతినిధులతో చర్చించి త్వరగా ఫీల్డ్ అసిస్టెంట్ల నియామకం చేపట్టి మార్చి 31 నాటికి వీలైనన్ని పని దినాలు కల్పిస్తామని చెప్పారు.

## క్లుప్తంగా

### ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది విధుల బహిష్కరణ రేపు

కదిరి టౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం విధులను బహిష్కరించనున్నట్లు ఎన్టీఆర్ వైద్య సేవ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు షేక్‌బాబ్‌జాన్, పవన్ కుమార్, అమరేంద్ర హరికృష్ణ తెలిపారు. ఈమేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. విధుల బహిష్కరణపై ఇప్పటికే జిల్లా కోఆర్డినేటర్‌కు వినతిపత్రం అందించామని తెలిపారు. సమస్యలు పరిష్కరించకపోతే యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 17, 24 తేదీల్లో కూడా విధులను బహిష్కరించనున్నట్లు పేర్కొన్నారు.

### కల్లు దుకాణం పై దాడి

మడకశిర: పట్టణంలోని చీపులేటిలో శనివారం రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు కల్లు దుకాణం పై దాడి చేశారు. ఈసందర్భంగా కల్తీకల్లు, కల్తీ చేయడానికి వినియోగించే మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడంతోపాటు పలువురిని అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ కల్లు దుకాణాన్ని లైసెన్స్‌దారుడు కాకుండా వేరే వ్యక్తి నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్ ఫోర్స్ అధికారులకు అందిన సమాచారం మేరకు ఈ దాడి చేసినట్లు సమాచారం. స్థానిక ఎక్సైజ్ అధికారులు కూడా ఈ ఘటనపై వివరాలను అందించలేదు.

### మామిడి, చింతచెట్లు దగ్ధం



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గుడిబండ: మందలపల్లి సమీపంలోని కొండకు నిప్పుపెట్టడంతో దగ్గరలోని మామిడి, చింతచెట్లు దగ్ధమయ్యాయి. బాధిత రైతుల వివరాల మేరకు.. రైతు చిక్కన్న, సన్నమారప్ప 30 ఏళ్లుగా మామిడి, చింత, కొబ్బరి చెట్లను అభివృద్ధి చేశారు. శనివారం మధ్యాహ్నం ఆకతాయిలు ఎండుగడ్డికి నిప్పు పెట్టడంతో చిక్కన్న, సన్నమారప్ప తోటలకు వ్యాపించాయి. గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బందిని మంటలు ఆర్పివేశారు. అయితే అప్పటికే దాదాపు 400 మామిడి చెట్లు, 100 చింత చెట్లు కాలి బూడిదయ్యాయి. ఘటనలో దాదాపు రూ.20 లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితులు వాపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని కోరారు.

# ఖర్చులు నిల్.. లాభాలు ఫుల్

- లాభదాయకంగా ప్రకృతి వ్యవసాయం
- తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు
- మడకశిర నియోజకవర్గంలో 137 గ్రామాల్లో పంటల సాగు





మడకశిర మండలం మరువపల్లిలో రైతు మల్లికార్జున పండించిన ముల్లంగిని పరిశీలిస్తున్న అధికారులు, తనకల్లు మండలం నకరాళ్లతండా వద్ద సాగైన టమాట

మడకశిరరూరల్: నియోజకవర్గంలోని రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపుతున్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించడంతోపాటు గిట్టుబాటు ధర లభిస్తోంది. దీనికితోడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహకారం అందిస్తుండడంతో ప్రకృతి వ్యవసాయం కింద పంటల సాగు పెరిగింది. వ్యవసాయశాఖ ద్వారా 2016లో మడకశిర మండలంలో 15 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రారంభించారు. ఈ పద్ధతి లాభదాయకంగా ఉండటంతో మిగతా రైతులు దాన్ని అనుసరిస్తున్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలోని మండలాల్లో 137 గ్రామాల్లో 25,500 మంది రైతులు ప్రకృతి పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నారు. వేరుశనగ, కంది, పూలతోటలు, మొక్కజొన్న, మిరప, రాగి, కూరగాయలు, అరటి, వక్క, మామిడి పంటలతోపాటు అంతర పంటలను డ్రిప్ సౌకర్యంతో సాగు చేసి అధిక దిగుబడులు పొందుతూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారు.

**పంటల సాగు ఇలా..**

బీడ భూముల్లో నవధాన్యాల విత్తనాలు అలసంద, సజ్జ, అనుములు, అముదంతో పాటు 24 రకాల జీవ వైవిధ్య పంటల విత్తన గుళికలు సాగు చేయిస్తున్నారు. దీంతో నవధాన్యాలు పండడంతో పాటు భూమి సారవంతమై ఖరీఫ్‌లో సాగు చేసే పంటలు మంచి దిగుబడి పొందడానికి ఆవకాశం లభిస్తోంది. పొలంలో సూర్య మండల మోడల్ ఆకారం ఏర్పాటు చేసి బహుళ పంటలు, బహుళ-స్థాయి సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పించి పంటలు సాగు చేయిస్తున్నారు. మడకశిర నియోజకవర్గంలో అమలవుతున్న ప్రకృతి వ్యవసాయం విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 15 దేశాలకు చెందిన 30 మంది విదేశీ సభ్యుల బృందం అధ్యయనం చేసింది.

### ప్రకృతి వ్యవసాయానికి ప్రోత్సాహం



ద్రవ జీవామృతాన్ని తయారు చేస్తున్న రైతులు

తనకల్లు: మండలంలో ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ కింద వ్యవసాయాధికారులు, జనజాగృతి సంస్థ అజీజ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ సహకారంతో ఆర్‌డబ్ల్యూఐ (రాయలసీమ వాటర్ ఇనిషియేటివ్) ప్రాజెక్టు కింద ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా మల్లిరెడ్డిపల్లి, చీకటిమానిపల్లి, తవళం, గేమేనాయక్‌తండా పంచాయతీల్లోని 19 గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం కింద పంటలు సాగు చేస్తున్నారు. ఆవు మూత్రాన్ని సేకరించి ద్రవ, ఘన, పంచగవ్య, నీమాస్త్రం వంటి కషాయాలతో పంటకు ఆశించే తెగుళ్లు, చీడ పీడలను నివారించుకుంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో జీలుగ, ఆముదం, అలసంద, ఉలవలు వంటి వాటితో పచ్చరొట్ట ఎరువును తయారు చేసుకొని పంటలకు వాడుకుంటున్నారు. అలాగే బొగ్గుపొడి, దిబ్బ ఎరువు, బెల్లం నీళ్ల మిశ్రమంతో బయోచారును తయారు చేసి వినియోగించుకుంటున్నారు. ప్రకృతి వ్యవసాయం కింద వేరుశనగ, టమాటతో పాటు వంకాయ, బెండ, మిరప, బీర, సొరకాయ, చిక్కుడు తదితర 16 రకాల కూరగాయలతో పాటు తోటకూర, పలకాకు, గోంగూర మెంతాకు, కొత్తిమీర మొదలైన ఆకుకూరలను సాగు చేసుకుంటున్నారు. అలాగే సజ్జ, మొక్కజొన్న, చిరుధాన్యాలు పండిస్తున్నారు.

### ప్రకృతి వ్యవసాయంతో లాభాలు



బోరు కింద 20 సెంట్లలో రూ.5 వేలు ఖర్చు పెట్టి ఏటీఎం మోడల్‌లో వివిధ కూరగాయలు సాగు చేశా. పంట దిగుబడి బాగా వచ్చింది. రోజూ ముల్లంగి, ఆకు కూరలను గ్రామాల్లో విక్రయిస్తున్నా. మూడు నెలలకు పెట్టుబడి పోనూ రూ.45 వేలకు పైగా ఆదాయం వచ్చింది. ప్రకృతి వ్యవసాయం లాభదాయకంగా ఉంది.
– మల్లికార్జున, రైతు ,మరువపల్లి, మడకశిర మండలం

### మార్కెట్ సౌకర్యం కల్పించాలి



ఏడేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పంటలు సాగు చేస్తున్నాను. ప్రస్తుతం రెండెకరాల వక్కతోటలో రూ.7 వేల ఖర్చుతో 15 రకాల పంటలను ఏ గ్రేడ్ మోడల్‌లో, రూ.5 వేల ఖర్చుతో ఏటీఎం మోడల్ ఎకరాలో కూరగాయలు సాగు చేశాను. దిగుబడి బాగా వచ్చిన మార్కెట్ సౌకర్యం లేక విక్రయించడానికి ఇబ్బంది పడుతున్నాం. మార్కెట్ సౌకర్యం కల్పించాలి.
– మోహన్‌దాస్ ,రైతు, నీలకంఠాపురం, మడకశిర మండలం

### అవగాహన కల్పిస్తున్నాం



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నాం. ఆర్ డబ్ల్యూఐ ప్రాజెక్టులో భాగంగా తనకల్లు మండలంలో ఎంపిక చేసిన 19 గ్రామాల్లో రబీ సీజన్‌లో 200 ఎకరాల్లో వేరుశనగ, 150 ఎకరాల్లో టమాట, 16 రకాల కూరగాయలతో కిచెన్ షెడ్లను ఏర్పాటు చేయించాం. – గరుడప్ప, జనజాగృతి ప్రతినిధి, తనకల్లు

### ఘనంగా ఏపీఆర్ఎస్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబు

పరిగి: కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం వార్షికోత్సవంతో పాటూ ఫేర్‌వెల్ డేను ప్రిన్సిపాల్ ఎన్వీ మురళీధర్‌బాబు ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగింది. విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం పాఠశాల ఉపాధ్యాయులకు విద్యార్థులు పాదాభివందనాలు చేసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. విద్యార్థులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ భావోద్వేగాలకు గురయ్యారు. కార్యక్రమంలో ఎంఈఓ శేషాచలం, పూర్వ విద్యార్థులు వెంకటకృష్ణ( బ్యాంక్ ఆఫ్ అమెరికా ఈడీ, న్యూజెర్సీ, యూఎస్ఏ), కృష్ణవేణి(మేనేజర్, పీవీహెచ్ కార్పొరేషన్, న్యూజెర్సీ), పాఠశాల చైర్‌పర్సన్ కుమారి, వైస్ చైర్మన్ రామాంజనేయులు, ఉపాధ్యాయులు, పుర ప్రముఖులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### మహిళ మెడలో బంగారు గొలుసు అపహరణ

గుత్తి రూరల్: మండలంలోని అబ్బేదొడ్డి గ్రామంలో ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును శనివారం గుర్తు తెలియని దొంగ అపహరించాడు. బాధితురాలి వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మీదేవి వేకువజామున ఇంటి బయట పనిలో నిమగ్నమైంది. ఇంతలో ముసుగు ధరించిన ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆమెపై ఒక్కసారిగా దాడి చేసి మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కొని పరిగెత్తాడు. మహిళ బిగ్గరగా కేకలు వేయడంతో విషయం తెలుసుకున్న కొందరు గ్రామస్తులు దొంగను వెంబడించారు. అయితే దొంగ వారికి దొరకకుండా పారిపోయాడు. దొంగ మహిళ మెడలోని గొలుసును లాగిన సమయంలో సగం తెగిపోయి అక్కడే పడిపోగా సగం గొలుసును ఎత్తుకెళ్లాడు. పోలీసులు గ్రామానికి చేరుకొని వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

### రైలులో తమిళనాడు వాసి మృతి



మృతుడు దురైస్వామి

ధర్మవరం: అనారోగ్యంతో రైలులో తమిళనాడు రాష్ట్రానికి చెందిన వ్యక్తి మృతి చెందిన సంఘటన ధర్మవరంలో శనివారం జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా అత్తూరు తాలూకాకి చెందిన శ్రీనివాసం దురైస్వామి(46)కి మూడునెలల క్రితం స్వగ్రామంలో కుక్క కరిచింది. వైద్యం చేయించుకోకుండా బోర్‌వెల్ పని చేసేందుకు మహారాష్ట్రలోని ఒక గ్రామానికి వెళ్లాడు. కుక్క కరిచిన చోట ఇన్ఫెక్షన్ అయి అనారోగ్యానికి గురికావడంతో మహారాష్ట్ర నుంచి స్వగ్రామానికి రైలులో బయలుదేరాడు. రైలు ధర్మవరం రైల్వేస్టేషన్‌లోకి చేరుకునే సమయానికి దురైస్వామి మృతి చెందాడు. రైలులో ఉన్న ప్రయాణికులు ధర్మవరం రైల్వే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మృతదేహాన్ని ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య ప్రసన్న, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

### ముగిసిన హెచ్చెల్సీ కోటా

- జిల్లాకు 33.931 టీఎంసీల విడుదల

అనంతపురం సెంట్రల్: తుంగభద్ర జలాశయం హెచ్చెల్సీ కోటా శనివారంతో పూర్తయింది. దీంతో నీటిని నిలుపుదల చేశారు. అదనపు జలాలతో కలిపి మొత్తం 33.931 టీఎంసీలు ఈ ఏడాది హెచ్చెల్సీకి విడుదలయ్యాయి. ఆశించిన స్థాయిలో నీరు రావడంతో రైతులు పంటలకు పుష్కలంగా అందించారు. తొలుత దామాషా ప్రకారం కేవలం 26 టీఎంసీలు కేటాయించారు. వర్షాలు కురిసి జలాశయం నిండడంతో కేటాయింపులు పెంచారు. హెచ్చెల్సీ కోటా 30.881 టీఎంసీలు, కేసీ కెనాల్ కోటా 3.50 టీఎంసీలు మొత్తం 33.931 టీఎంసీలు విడుదల చేశారు. ఈ క్రమంలో 90,355 ఎకరాలకు సాగునీటిని అందించారు. వాస్తవంగా గత నెలలోనే కోటా పూర్తి కాగా గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ కింద పంటలు చివరి దశలో ఉండడంతో అదనంగా 0.5 టీఎంసీలను కేటాయించారు. ప్రస్తుతం కణేకల్లు చెరువులో 0.227 టీఎంసీలు, పీఏబీఆర్‌లో 3.029 టీఎంసీలు, ఎంపీఆర్‌లో 0.835 టీఎంసీల నీటి నిల్వ ఉంది. పీఏబీఆర్ నీటిని రానున్న వేసవిలో తాగునీటి అవసరాలకు వాడుకోనున్నారు. ఎంపీఆర్‌లో నిల్వ ఉన్న నీటిని సౌత్ కెనాల్, నార్త్ కెనాల్స్‌కు వరుసగా 200 క్యూసెక్కులు, 90 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నారు. ఈ విషయంపై 'సాక్షి'తో హెచ్చెల్సీ ఎస్ఈ రాజశేఖర్ మాట్లాడుతూ తుంగభద్ర జలాశయం నుంచి ఆశించిన స్థాయిలో నీళ్లు విడుదలయ్యాయన్నారు. అదనపు కోటా కలిపి 33.931 టీఎంసీలు విడుదల కావడంతో దాదాపు లక్ష ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగు నీరు విడుదల చేశామన్నారు. చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాలు అభివృద్ధి చెందాయని చెప్పారు.

# అయినా.. అట్టడుగునే!



- అమ్మాయిల సంఖ్యలో చివరి స్థానంలో 'ఉమ్మడి అనంత'
- ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు 977 మందే అమ్మాయిలు
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

**ఉమ్మడి జిల్లాలో ప్రతి వెయ్యిమంది అబ్బాయిలకు అమ్మాయిల సంఖ్య**

| సంవత్సరం | సంఖ్య | సంవత్సరం | సంఖ్య |
|---|---|---|---|
| 1961 | 946 | 1971 | 947 |
| 1981 | 946 | 1991 | 946 |
| 2001 | 958 | 2011 | 977 |

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఐఐటీల్లో సీట్లు సాధిస్తున్నా.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా రాణిస్తున్నా.. జననాల పరంగా మాత్రం అమ్మాయిలు ఇంకా వెనుకబడే ఉన్నారు. 30 ఏళ్లుగా ఇదే దుస్థితి కొనసాగుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో గడిచిన ఐదు దశాబ్దాల్లో ఒక్కసారైనా అబ్బాయిల కంటే అమ్మాయిల సంఖ్య పెరగలేదు. తాజా సామాజిక, ఆర్థిక సర్వే ప్రకారం అమ్మాయిల సంఖ్యా పరంగా ఇప్పటికీ ఉమ్మడి అనంతపురం జిల్లా అట్టడుగున ఉన్నట్లు వెల్లడైంది.

**యథేచ్ఛగా లింగనిర్ధారణ..**

ఉమ్మడి జిల్లాలో పలు రేడియోడయాగ్నస్టిక్స్ సెంటర్లలో యథేచ్ఛగా లింగనిర్ధారణ జరుగుతోంది. ఈ దురవస్థ వ్యాపారంగా సాగుతోంది. కొంతమంది గైనకాలజిస్టులు, రేడియాలజిస్ట్‌లు అత్యంత గోప్యంగా ఏజెంట్ల ద్వారా అబార్షన్లు నిర్వహిస్తున్నారు. జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు డయాగ్నస్టిక్ సెంటర్లు, సంబంధిత డాక్టర్లపై చర్యలు తీసుకోలేకపోతున్నారు.

**వారసుల కోసం ఆరాటం..**

ఆస్తిపాస్తులు లేకపోయినా చాలా కుటుంబాల్లో 'మగపిల్లాడు ఉండాలి.. వారసుడు అంటే మగపిల్లవాడే' అన్న మూఢ విశ్వాసంతో ఉన్నారు. మహిళ గర్భం దాల్చిందని తెలియగానే ముందుగా ఆడపిల్లా, మగపిల్లాడా అని తెలుసుకునేందుకు రకరకాల మార్గాలు ఎంచుకుంటున్నారు. తొలికాన్పులో ఆడపిల్ల పుట్టిన వారు రెండో కాన్పులోనైనా మగ పిల్లవాడి కోసం ఇలా చేయడం పరిపాటిగా మారింది. ఇలాంటి నమ్మకాల వల్ల కూడా ఆడపిల్లల సంఖ్య తగ్గుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు అమ్మాయిలు లేక అబ్బాయిలకు 30 ఏళ్లు దాటినా పెళ్లిళ్లు కావడం లేదు.

### అమ్మాయిల సంఖ్య తగ్గడానికి కారణాలివే..



- లింగనిర్ధారణ నిరోధక చట్టం సరిగా అమలు కాకపోవడం.
- డయాగ్నస్టిక్ సెంటర్ల రిజిస్ట్రేషన్లు, రెన్యూవల్స్ సరిగా చేయకపోవడం.
- ఫిర్యాదులను పట్టించుకోకపోవడం.
- కేసులు నమోదవుతున్నా కఠిన చర్యలు తీసుకోకపోవడం.
- జిల్లా స్థాయి కమిటీల పర్యవేక్షణ లేకపోవడం.
- లింగనిర్ధారణ నిరోధక చట్టం అమలుకు నిధులు ఇవ్వకపోవడం.
- ఇచ్చిన నిధులు కూడా సరిగా వినియోగించకపోవడం.

# మాటకు కట్టుబడి ఉన్నా

- ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే 7 నెలల్లో 7,500 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తాం
- 50 వేల మంది మహిళల సొంతింటి కలను చిదిమేసిన పరిటాల సునీత
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి

రాప్తాడురూరల్: 'ఈ ఈవీఎంలతోనో, మరేదో కారణంగానో గెలిచారు. నన్ను ఆర్థికంగా, రాజకీయంగా అణచివేయాలనే దురాలోచనతో రాష్ట్రంలోని 50 వేలమంది మహిళల సొంతింటి కలను పరిటాల సునీత చిదిమేశారు. ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే ఆలమూరు, కొడిమి జగనన్న కాలనీల్లో 7,500 ఇళ్లను 7 నెలల్లో పూర్తి చేస్తా. ఇది నా ఛాలెంజ్' అని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సవాల్ విసిరారు. శనివారం నగర శివారులోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అనంతపురం ఎమ్మెల్యే...పరిటాల సునీతకు భయపడుతున్నారో లేదంటే ఇళ్ల నిర్మాణం బాధ్యతను వదులుకున్నారో తెలీదన్నారు. జన్మలో ఆమె కానీ, ఆమె భర్త కాని సొంత డబ్బు ఖర్చు చేసి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చారా?, పేదలకు రూ.1.80 లక్షలతో ఇల్లు కట్టాలనే ప్రయత్నం చేశారా? అని పరిటాల సునీతను ప్రశ్నించారు.

**దప్పికయినప్పుడు బావి తవ్వాలనే విధానం..**

పేరూరు డ్యాంకు హంద్రీ–నీవా మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి రొద్దం మండలంలోని పెన్నానది మీదుగా నీళ్లు తీసుకురావొచ్చని తాము చెప్పినా వినలేదన్నారు. దప్పికయినప్పుడు బావి తవ్వాలనే విధానంతోనే పరిటాల సునీత 2018లో జీడిపల్లి నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు కాలువ నిర్మాణానికి టెండర్లు పిలిపించి 2019లో పనులు ప్రారంభించారన్నారు. ముందుగానే కాంట్రాక్టర్ నుంచి కమీషన్లు దండుకున్నారన్నారు. ఒక రూపాయి కూడా నిధులు తేలేదన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాత వారికి సంబంధించిన కాంట్రాక్టర్‌కు రూ.170 కోట్ల నిధులు ఇప్పించి పనులు వేగవంతం చేయించామన్నారు. పూర్తిస్థాయిలో పనులు అవ్వాలంటే పదేళ్ల పడుతుందని భావించి అప్పటిదాకా ఈ ప్రాంత రైతులను ఎండబెట్టడం సరికాదని, అప్పటి సీఎం జగనన్నతో మాట్లాడి ప్రత్యేకంగా మడకశిర బ్రాంచ్ కెనాల్ నుంచి పేరూరు డ్యాంకు ఒక టీఎంసీ నీళ్లు తీసుకొచ్చేందుకు జీఓ తెచ్చామన్నారు. తర్వాత దాతలు, రైతుల సహకారంతో 45 కిలోమీటర్ల మేర కాలువ నిర్మించి డ్యాంకు నీళ్లు తీసుకొచ్చామని గుర్తు చేశారు.

**పరిటాల సునీత తత్వం రైతులకు బోధపడింది..**

ప్రస్తుతం శ్రీశైలం డ్యాంలో పుష్కలంగా నీళ్లున్నాయని, చంద్రబాబుతో పరిటాల కుటుంబం సన్నిహితంగా ఉంటోందని, పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చేందుకు అవకాశాలున్నా పరిటాల సునీత ఏరోజూ చంద్రబాబుతోగాని, లోకేష్‌తోగాని మాట్లాడలేదన్నారు. తీరా మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు వదిలే సమయంలో రిపేరీల పేరుతో డ్యాంకు ఉన్న గేట్లు తీయించారన్నారు. వచ్చే ఏడాది నీళ్లిస్తామంటూ కట్టుకథలు చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిటాల సునీత తనకు లాభం లేనిదే ఏపనీ చేయదనే తత్వం రైతులకు బోధపడిందన్నారు. ఇక కమీషన్ల కోసమే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ పనుల కోసం కక్కుర్తి పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. పేరూరు డ్యాం, చెరువులను ఎండబెట్టి మీ జేబులను మాత్రం కమీషన్లతో నింపుకుంటారా?అని ప్రశ్నించారు.

### కౌంటరు దాఖలు చేయని దద్దమ్మ ప్రభుత్వం..

ఇళ్ల నిర్మాణాల నిలుపుదలపై రాక్రీట్ సంస్థ కోర్టుకు వెళ్తే...మీ చేతకాని చవట దద్దమ్మ ప్రభుత్వం ఇప్పటిదాకా కనీసం కౌంటర్ వేయలేదని ప్రకాష్‌రెడ్డి మండిపడ్డారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తి కాకుండానే విజిలెన్స్ విచారణ ఏంటని, రాక్రీట్ సంస్థకు ఎందుకు బిల్లులు ఆపారని జడ్జిగారు ప్రశ్నిస్తే.... తమకు, ఆ సంస్థకు సంబంధం లేదని అడ్వొకేట్ జనరల్ చెప్పారని గుర్తు చేశారు. ఈ కేసు నుంచి ఏమీ సాధించలేమని భావించి కౌంటరు వేయకుండా నిలిపేశారన్నారు. 9 నెలలుగా మీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, విజిలెన్స్ విచారణలన్నీ పూర్తి చేశారన్నారు. మళ్లీ ఈరోజు సునీత అసెంబ్లీలో రాక్రీట్ సంస్థ గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.

### ఫీజు పోరును జయప్రదం చేయండి..

ఈనెల 12న పుట్టపర్తిలో నిర్వహించే ఫీజు పోరు, యువత పోరును జయప్రదం చేయాలని తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి పిలుపునిచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ నాయకులు న్యాయవాది కురుబ నాగిరెడ్డి, ఆత్మకూరు మండల కన్వీనర్ బాలపోతన్న, పార్టీ నాయకులు నీరుగంటి నారాయణరెడ్డి, మాదన్న, ఈశ్వరయ్య, వీరాంజి పాల్గొన్నారు.